సాధారణ ప్రచురణ(రూ. 1,000)కు ఎంపికయిన కథ

# ప్రవాహం


## యర్రమిల్లి విజయలక్ష్మి

''అలా తలుపులు చేరేసి చీకటుండగానే ఒడ్డుకు పోతావే.. ఏ దొంగ వెధవన్నా దూరి చెంబూ తప్పేళ కాజేసిపోతే ఏం చేస్తావే? ఓ వానని లేదు..చలని లేదు..రోజూ తెల్లారగట్ట ఆ నదిలో ములగటమేమిటీ. బీడీలన్నీ నాచుపట్టి జారిపోతూ వుంటాయి. కాలు గాని జారితే ఏమన్నా వుందా? ఎగువ వరదలు.. ఒరవడిగా వుంది కూడా'' అని తను గాభరా పడుతూ ఆవిడ్ని కూడా బెదిరించాలని చూసేవాడు తాతయ్య. అయినా ఆవిడ చేసేది ''ఏం పర్వా లేదు గోదావరి నాకేం కొత్తా ఏమిటీ..? ఇంతప్పట్నుంచి అలవాటు.. మా మామ్మతో వెళ్ళి స్నానం చేసే దాన్ని కదూ.. ఎప్పుడెంత వడో.. ఎక్కడెంత లోతో తెలియదా నాకు..! గోదాట్లో స్నానం చేసి గుళ్ళన్నీ చూసి రాకపోతే నాకు తోచదు.

మీకా భయమేమీ అక్కర్లేదు'' అని నవ్వుతూ ఆయన భయాన్ని తోసిపడేస్తూ- ''మీరూ.. రారాదూ... బారెడు పొద్దెక్కేదాకా ఆ దినపత్రికలు కంఠస్తం చేస్తూ కూర్చోపోతేనూ..! ప్రవహించే నదిలో స్నానం వంటికి ఆరోగ్యం. అమ్మవారిని, అయ్యవారిని దర్శించుకుని రోజు ప్రారంభిస్తే శుభానికి శుభం..మనసుకి 'శాంతి' '' ఇంచుమించు ప్రతీరోజూ వాళ్ళిద్దరి మధ్య ఇదే సంభాషణ. ఆయన నదికి మాత్రం వెళ్ళడు. అదంతా ఆడవాళ్ళ వ్యవహారమనుకుంటాడు. ఆవిడ దినచర్య నిమిషం అటు ఇటు అవదు.

నా ఆలోచన ఆగటం లేదు. ఈ సమయంలో వాళ్ళ ఆలోచన అదేపనిగా మనసులో కదలటం సహజమే. కానీ అదేమిటో అమ్మమ్మని తలుచుకుంటే ఆవిడ కంటే ముందు గోదావరే మనసులో ప్రవహిస్తోంది. వాళ్ళ జీవితంలో గోదావరి తప్ప మరో అంశమే లేనట్టు. మనసుని బలవంతంగా ఎటు మరల్చినా గోదావరే పరవళ్ళు తొక్కుతూ ప్రవహిస్తోంది.

''నాకో అనుమానం..నువ్వు దేవుళ్ళని చూట్టానికి వెడుతున్నావా అసలు..నది కోసమా?'' అనేవాడు తాతయ్య. ఆవిడ మాటల్లో ఎప్పుడూ ఏదో ఆత్మీయబంధువులా గోదావరే దొర్లేది ''ఈవేళ నీళ్ళెంత వెచ్చగా వున్నాయో, ఎంత తియ్యగా.. అమృతం తాగినట్టే..! ఏమిటో ఈవ్వాళ తల్లి నెమ్మదిగా మందంగా వుంది. ఎగువ వానలు కదా! మూడు గట్లు మునిగిపోయాయి. నది గుండెల్లో మెదిలే మూడ్సన్నీ తన భాషలో వివరిస్తుంది. ఒక్కోసారాయన విసుక్కుంటాడు. విచిత్రపడతాడు. గోదావరి ఆవిడకో నది కాదు. తన్నుంచి వేరు కాదు.



మనసు ఆహ్లాదంగా వున్నప్పుడు ఆయన శాంతంగా శ్రద్ధగా ఆవిడగారి గోదారి ఊసులన్నీ వింటాడు. విని, ఒక్కసారి! నేనూ ఓసారి వెళ్ళి చూసిరానేవిటి'' అని చిలక్కొయ్యకున్న కండువా భుజాన వేసుకుని బయల్దేరుతాడు. అప్పుడావిడ మనసుకెంతో ఆనందం. ''ఒక మంచి అనుభూతి తను మాత్రమే పొందితే సరిపోతుందా..తనవాళ్ళు ఆ ఆనందాన్ని అనుభవించి తరించినప్పుడే కదా తనకు తృప్తి'' అనుకుంటుంది పాపం.. మగాళ్ళు.. కుదరక.. తీరక కానీ ఆయనకి మాత్రం వుండదూ.. మనిషై పుట్టాక పుణ్యం, పురుషార్థం కావాలని ఎవరికి మాత్రం వుండదు. ఇంటికి ఎవరొచ్చినా అంతే. సాయంకాలాలు విధిగా గోదావరి ఒడ్డుకి తీసుకెళ్ళి తీరంలో పరివేష్ఠించి వున్న సిద్ధి వినాయకుడి మొదలు షిర్డీ సాయిబాబా వరకు గల దేవీ దేవతలనందర్నీ చూపించి తీసుకు రావాల్సిందే. అది ఆవిడ స్వయంగా చెయ్యాలి! ఎవరన్నా సరే, ఇష్టమున్నా లేకపోయినా వెళ్ళి గోదావరికి నమస్కరించుకు రావాల్సిందే..అందరూ తప్పనిసరిగా దర్శించవలసిన అపురూపమైన ఆధ్యాత్మిక కేంద్రం గోదావరి తీరమని ఆవిడ విశ్వాసం.

'పాపం.. తాతయ్య!' పెద్ద వయసులో ఇంత కష్టాన్ని తట్టుకోగలడా? నా మనసంతా అగ్రహారం చుట్టూ తిరుగుతోంది. తాతయ్య స్థితి ఊహించుకోవటానికే బాధగా వుంది! అప్పుడు నాకు పద్నాలుగేళ్ళు.. మా తాతయ్యకి ఇరవై. పెద్ద మనిషి కాకుండానే ఆడపిల్లకు పెళ్ళి చెయ్యాలని కట్టు మా మేనత్తకి నేనంటే అమిత ప్రేమ. పప్పు కట్టి కొడుక్కి నీసుకుంది. ఇప్పుడంటే మేనరికాలు చెయ్యకూడదంటున్నారు- అప్పట్లో చాలా మటుకు


# సి.పి.బ్రౌన్ అకాడమీ - నవ్యవీక్లి కథల పోటీ

## కథ

మేనరికాలే చేసేవారు. పిల్లని ప్రేమగా చూసు కుంటారని! ముగ్గురు పిల్లలూ హాయిగా, ఆరోగ్యంగా వున్నారు' అని అప్పుడప్పుడు తన పెళ్ళి ముచ్చట్లు చెప్తుండేది.. తాతయ్య బ్రతకగలడా.. అమ్మమ్మ లేకుండా.

విజయవాడ వరకూ ప్రయాణం సుఖంగా జరిగింది అక్కడ్నించి మా ఊరు ప్రయాణం మరో ఎత్తు. రెండుసార్లు మళ్ళీ వెనక్కి వెళ్ళి రావచ్చు. గ్లోబల్ విలేజంటారు ప్రపంచమంతా. దేశమంతా ఎంతో ఆధునికీకరించబడింది కానీ మా ఊరి ప్రయాణంలో మాత్రం మార్పు లేదు. నేను కంప్యూటర్ ఇంజనీరుగా పనిచేస్తున్న మహానగరం నుంచి-సెలవు మీద కష్టంలో వున్న తాతయ్యని చూడటానికి వెడుతున్నాను. కాలగమనం తెలియ కుండా నా మనసు నిండా అమ్మమ్మ.. తాతయ్యే..! హైస్కూలు చదువుకొచ్చే వరకూ నేను అమ్మమ్మ తాతయ్య దగ్గరే వున్నాను. ఆ వయసులో ఆ పరిసరాలు, అమ్మమ్మ ప్రభావం నా మీద బాగానే వుండేవి. నాకూ గోదావరి అంటే ఎంతో ఇష్టంగా వుండేది. అమ్మమ్మతో కలిసి గోదావరి స్నానాలు, దైవ దర్శనాలూ చేసుకునే దాన్ని. అయితే అప్పట్లో జరిగిన ఒక దుర్ఘటన గోదావరి మీదే కాక- ఆ అగ్రహార జీవితం పట్లే నాలో తీవ్రమైన అసంతృప్తిని, అయిష్టాన్ని కలిగించింది.

గోదావరి గట్టుకి పదిబారల దూరంలో వుంటుంది అమ్మమ్మ గారిల్లు. అదంతా లోతట్టు ప్రాంతం. ఆ నీరు తాగి, ఆ గాలి పీల్చుకుని ఆ నది ప్రదర్శించే వివిధ భావాలకు భక్తితో తల ఒగ్గి జీవిస్తారు అక్కడి ప్రజలు. మా అమ్మమ్మే కాదు. ఆ ప్రాంతంలోని చాలా మంది పురుషులు, స్త్రీలు గోదావరి నదిని తల్లిలా ప్రేమిస్తారు. దేవతలా కొలుస్తారు, పూజిస్తారు. ఆమె ప్రసన్నంగా వుంటే ఆ ప్రాంతమంతా పచ్చగా పాడి పంటలతో సుభిక్షంగా వుంటుంది. సిరి, సంపదలతో తులతూగుతుంది. అశాంతితో కన్నెర్ర చేస్తే జనజీవితమంతా అస్తవ్యస్తమైపోతుంది. కరువు కాటకాలతో ప్రజలు అతలాకుతలమైపోతారు. గోదావరిలాగే వాళ్ళ బతుకులు పొంగుతూ వుంటాయి. శాంతింప చేయటానికి పూజలు, ప్రార్థనలు చేస్తారు. నది విచిత్రమైన ప్రకృతి రూపం. మానవ జీవితాన్ని నదీ ప్రవాహంతో పోలుస్తారు. మానవ మేథకు అందని ఊహాతీతమైన అతీతశక్తిగా భావిస్తారు. నిర్వచనాల కందని ప్రకృతి రూపాన్ని పరమాత్మ తత్వంతో కొలుస్తారు. 'గోదావరంటే ఒక నీటి ప్రవాహమే కాదు సాక్షాత్తూ అమ్మవారి శుద్ధచైతన్యమే! ప్రకృతి పరమాత్మే చెట్టు, పుట్ట, నేల, నీరు, గాలి, నింగి...ఇవన్నీ ప్రకృతి విశ్వ వ్యాప్త రూపాలు. గోదావరి, గోదావరి అని మనం మాములుగా పిలుచుకునే ఈ నది ప్రకృతి యొక్క అమృతాసారం' అమ్మమ్మ మాటల్లోని లోతును అర్థం చేసుకోగల వయసు కాదు నాదప్పుడు. అయితే ఆవిడ ప్రభావం నా మీద చాలానే వుండేది. కార్తీక మాసంలో రోజూ తెల్లవారుఝామున అమ్మమ్మ గోదావరి స్నానాల కెళుతున్నదని తను పేచీ పెడితే సోమవారాలు మాత్రం తీసుకెళ్ళేది. అమ్మమ్మ సంకల్పం చెప్పి శాస్త్రోక్తంగా స్నానం చేయిస్తే చలిలో తడి బట్టలతో మళ్ళీ, మళ్ళీ ఆవిడలాగే నదికి నమస్కారాలు చేసేది. అమాయకత్వం కావచ్చు. అమ్మమ్మ మీద తనకున్న అమితమైన ప్రేమ కావచ్చు. ఆ పసిప్రాయంలో మరో ముద్ర తన మనసు మీద పడకపోవటం వల్ల కావచ్చు! అందరూ తనని తమాషాగా 'అమ్మమ్మ' అని ఆట పట్టించేవారు. ఉడుక్కున్నా, ఎప్పుడూ అమ్మమ్మ కొంగు పట్టుకునే తిరిగేదాన్ని. ఇక తాతయ్యకు నేనంటే ప్రాణమే. వాళ్ళిద్దరితో పాటు నాకా ఊరు, ముఖ్యంగా నదంటే చెప్పలేని ఇష్టం ఏర్పడింది. గోదావరి చూడ్డానికెంతో ఉత్సాహంగా ఉండేది. అందంగా, శాంతంగా, చిత్రంగా అనిపించేది. ఎత్తైన కట్ట దిగి లాంచీల రేవులో లగ్జరీ లాంచీ ఎక్కి రాజమండ్రి వెళ్లడం గొప్ప సరదాగా ఉండేది. అఖండ గోదావరి మీద లాంచీ రొదచేసుకుంటూ ఠీవిగా సర్రు సర్రున నదీ ప్రవాహాన్ని అలవోకగా చీల్చుకుంటూ వెళ్లిపోతుంటే గొప్ప అద్భుతాన్ని అనుభవిస్తున్న ఆనందం కలి



గేది. గోదావరి రెండుపాయలుగా చీలి మాకు అవతలి గట్టుకి దారి ఇస్తున్నట్టు అనిపించేది. ఆ తీరం చేరాలనిపించేది కాదు, ఎంతసేపైనా ప్రవాహం మీదే తెప్పలా తేలిపోతూ వుండాలనిపించేది ''అప్పుడే వచ్చేసిందా రాజమండ్రీ'' అనిపించేది.

గోదావరి మీంచి ప్రయత్న పూర్వకంగా ఆలోచనని అమ్మమ్మ మీద నిలుపుకోవాలనుకుంటున్నాను. అమ్మమ్మ పెద్ద ఎత్తరి కాదు. సన్నగా పీలగానే ఉండేది. అయితే మొగలిపూవు ఛాయలో పుని స్త్రీ చిహ్నాలతో మనిషి చురుగ్గా కళకళలాడుతూ గుళ్ళో పార్వతి అమ్మవారి విగ్రహం లాగానే వుండేది. నడుస్తుంటే చిటుకు చిటుకు మట్టెలు...రంగు రంగుల గాజు గాజులు శబ్దం చేస్తూ ముందే ఆవిడ రాకని చెప్పేవి. తాతయ్య సుందరేశ్వరుడైతే ఆవిడ పార్వతీదేవి సార్థక నామమనిపించేది. ఆచార, వ్యవహారాలు తు.చ తప్పకుండా పాటించేది. ఎప్పుడూ మడి, తడి, ఆచారమంటూ నిష్ఠగా ఉండేది. తాతయ్య చాదస్తమని కోప్పడేవాడు. ఇంట్లో పైడి తల్లి పాచి పనీ అదీ చేసేది. ఆ వీధిలో అందరిళ్లలోనూ పైడి తల్లే పనిచేసేది. బతుకు తెరువు కోసం తూర్పు నుంచి వచ్చేసిన కుటుంబం. సింహాచలం భర్త ఆరేళ్ల కొడుకు సత్తెం... సత్యనారాయణ. ఎప్పుడూ చేతిలో ఒక సత్తు కారియర్ పుచ్చుకుని తల్లి వెంటే ఇంటింటికీ తిరిగేవాడు. ఎవరింట్లో మిగులు, తగులూ ఏమిచ్చినా కారియర్లో వేసి కొడుకు చేతికిచ్చేది పైడి తల్లి.

ఎప్పుడు చూసినా ఏదో ఒకటి తింటూ వుండేవాడు. చిరుతిండి పెడితే ఏ చెట్టూ కిందో కూర్చుని తింటూ వుండేవాడు. లేకపోతే పనిచేసుకోనివ్వకుండా తల్లి చుట్టూ తిరిగి సతాయించేవాడు. అమ్మమ్మకి ఆచారం...అందుకని పైడి తల్లి వాడికి తినడానికేదన్నా ఇచ్చి, పెరట్లో కూచోపెట్టేది. తనూ ఇంట్లోకి వచ్చేది కాదు. పెరటి గుమ్మం లోంచి వచ్చి, వాకిళ్ళు చిమ్మి, పాచి చేసి ముగ్గేసేది. బావి దగ్గర దూరంగా మందారచెట్టు కింద గిన్నెలు తోమి తెచ్చి తులసికోట గట్టుమీద బోర్లించేది. మేమెవరమన్నా వెళ్లి వాటిమీద పసుపు నీళ్ళు చల్లి తెచ్చి వాటిని లోపల పెట్టేవాళ్లం. నా మనసు సత్తిగాడ్ని చూపిస్తోంది. నల్లగా బలంగా గుండులా వుండేవాడు. వాడ్ని చూస్తే చాలా ముచ్చట అనిపించేది. ఆ కుటుంబాన్ని ఎంతో ఆదరంగా చూసేది అమ్మమ్మ– ఒకసారి.. ఆ సంఘటన తను ఎప్పటికీ మరిచిపోలేదు. అగ్రహారం గుర్తొస్తే నేనున్నానని ముందది గుర్తుపట్టి నా మనసుని పాడు చేస్తుంది. మూడు నాలుగు రోజులు ముసురు పట్టింది..చిత్తడి చిత్తడి వర్షం. నాలుగో రోజు తొలి పొద్దు వేళ వీధిలో జనం హడావిడిగా పరుగులు తీస్తున్నారు. గట్టుకానుకుని వున్న దిగువ వీధిలో పెంకుటి లోగిలి అమ్మమ్మ వాళ్ళ ఇల్లు. అప్పుడు ఇంట్లో అమ్మమ్మ తాతయ్య నేనే వున్నాం.

''గోదావరి పొంగుతోంది..మంచి పోటు మీదుంది. లే..లే'' అన్నాడు తాతయ్య కాస్త గాభరాగా.

''అలాగా... నాల్రోజుల్నుంచి వదలకుండా ముసురు.. ఎగువ భారీ వర్షాలాయే..రావే నిత్యా..! దణ్ణం పెట్టుకు వద్దాం'' అని చేతిలో పని ఆ పట్టున వదిలి బయల్దేరింది అమ్మమ్మ.

''జాగ్రత్త! ఒకటే యావ తప్ప..నీకు సమయం సందర్భం తెలియదు. అది కూడా ఎందుకు తోడు. నువ్వెడితే వెళ్ళు..!'' అని తాతయ్య వారిస్తున్నా వినలేదు. తనకూ చాలా కుతూహలంగా వుంది. ''ఈ పొంగేమిటో, పోటేమిటో! ఇపుడు ఎలావుందో'' తనెప్పుడు చూసినా చల్లగా నవ్వుతూ పలకరిస్తున్నట్టు ప్రశాంతంగా వుంటుంది. ''మరీ లోపలికి పోకమ్మా. అటు లోతెక్కువ, వెళ్ళకటు'' అని అమ్మమ్మ భయపడుతున్నా చెయ్యి విడిపించుకుని నడుం లోతుకు పోయి కేరింతలు కొట్టింది తను. అట్లాంటిది గోదావరి నిండుగా నురగలతో పరవళ్ళు తొక్కుతోంది. గట్టు మీంచి విసురుగా ఆనకట్ట హోరు ప్రవాహపు జోరు కలిసి రొదగా వినిపిస్తోంది. దూరంగా ఆ దరిని నది అంచు మీంచి సూర్యుడు బెదురు బెదురుగా చూస్తున్నాడు. మూడు రోజులుగా ముసురు మరుగున పడి వున్నాడు. మెల్లిగా కాంతిని పుంజుకుంటున్నాడు.

దూరంగా తన చెయ్యి పట్టుకు నిలబడి నదివంకే భక్తిగా చూస్తూ దణ్ణం పెట్టుకుంది అమ్మమ్మ. తనూ అట్లాగే దణ్ణం పెట్టుకుంది. తనకింకా అప్పటికి భయానుభవం లేకపోయినా ఆ వాతావరణం అదోలా దిగులుగా వుంది. కొందరు ఆడవాళ్ళు గట్టెక్కి చాటలతో పసుపు కుంకాలు, పూలు నదిలోకి వదులుతున్నారు. ''అమ్మా.. తల్లీ.. శాంతించు తల్లీ.. పిల్లా పాపలందర్నీ రక్షించమ్మా'' అని మొర పెట్టుకుంటూ నమస్కారాలు చేస్తున్నారు. గట్టు మీది గుళ్ళలోకి వరద నీరు చేరుకుంటోంది. వర్షాలకి అడుసు దిబ్బలా వున్న గట్టు మీద కాళ్ళు జారిపోతూ, కూరుకుపోతున్న కొందరు పిల్లలు మొలలకు గోచీ బిగించి కర్రలకి కొక్కాలు తగిలించి ప్రవాహంలో కొట్టుకుపోతున్న చెట్ల మోళ్ళను ఎలుగురేసి కలిసి బలంగా ఒడ్డుకు లాగుతున్నారు. కొందరు నీళ్ళలో దూకేసి ఎగువ నుంచి విరిగి కొట్టుకు వస్తున్న దుంగల్ని ప్రవాహానికి ఎదురీది ఎక్కొస్తున్నారు.


''అమ్మమ్మా! వాళ్ళేమిటీ..అలా చేసున్నారు?'' అడగింది తను, వాళ్ళెక్కడ నీళ్ళలో పడి కొట్టుకుపోతారోనని భయపడుతూ.

''వాళ్లా! వరదలోపడి ఎక్కడెక్కడ్నించో పెద్ద, పెద్ద చెట్లు, మొద్దులు కొట్టుకొస్తున్నాయి చూడు.. వాటికోసం! పేళ్ళు చేసి వంట చెరుకుగా అమ్ముకుంటారు పద త్వరగా పోదాం''

''నీళ్ళలో కొట్టుకుపోతారేమో కదూ''

''ఏం పోరులే.. వాళ్ళకి అలవాటే'' అమ్మమ్మ మళ్ళీ ఒకసారి ఉరుకులు పరుగులుగా ఎరుపులతో అద్భుత వేగంతో చెరువు కట్టలు దాటి దూకి దూకి వస్తున్న కల్లోల గోదావరికి దణ్ణం పెట్టుకుని–నా చెయ్యి పట్టుకుని లాక్కొచ్చేసింది. జనం కకావికలమైపోతున్నారు. పల్లపు ప్రాంతాల వారందర్నీ నిమిషాల మీద ఖాళీ చేయించి సురక్షిత ప్రదేశాలకు తరలించారు. అప్పటికే గట్లు తెంచుకుని వరదనీరు వీధుల్లోకి వచ్చేసింది. ఆ చుట్టుపక్కల వాళ్ళందరూ కొండరుగారి మేడ మీద కొందరు, ఎం.ఎల్.ఏ రామరాజు గారి భవనంలో కొందరు అలా పక్కా డాబాలున్న ఇళ్ళలో, మేడల్లో తల దాచుకున్నారు. రోడ్లన్నీ మునిగిపోయాయి. ఊరే గోదావరైపోయింది. రోడ్లు కనబడకుండా మునిగిపోయాయి. ఊరు ఊరంతా తెప్పలా తేలిపోయింది. ప్రభుత్వం, సేవా సంస్థలు ఆహార పొట్లాలు అందించి వరద బాధితులకి ఎంతో సేవ చేసాయి. కలప కోసం తెప్పల మీద నది మీద కెళ్ళిన వాళ్ళ కోసం ఆరాటపడసాగారు.

''నది మాంచిపోటు మీదుండాది ఎల్లొద్దంటే వినలేదయ్యగోరూ ఈడు. ఆడితో పిల్లోన్ని కూడా తీసుకెళ్ళాడు. ఎల్లినోళ్ళు సాలా మంది వచ్చేసారండీ మల్లే రాలేదయ్యగోరూ'' అని పైడితల్లి ఒకటే ఏడుపు. వరదలో గేదెలు, ఆవులు, మేకలు ఎన్నో కొట్టుకుపోయాయి. ఎంతో ప్రాణనష్టం జరిగింది. నాలుగు రోజులకు వరద తీసాక సత్తిగాడు, సింహాచలం మృతదేహాలు కనబడ్డాయి. పైడితల్లి దుఃఖం పట్టలేకపోయాం. బాధితులకి నష్టతీవ్రతను బట్టి పరిహారం ఇస్తామంది ప్రభుత్వం. ఇంచుమించు గట్టు కిందున్న ఇళ్ళన్నీ మునిగిపోయాయి. సకాలంలో రక్షిత ప్రాంతాలకు చేర్చబట్టి ప్రాణనష్టం కొంత అరికట్ట



గలిగారు. గోదావరి గట్టు పొడవునా బురదలో కూరుకుపోయిన మనుష్య, జంతు కళేబరాలెన్నో క్రమంగా బయటపడ్డాయి.

ఎప్పుడూ పరమశాంత మూర్తిలా గంభీరంగా, ప్రశాంతంగా వుండే గోదావరి ఒక్కసారిగా విజృంభించి విలయతాండవం చేసేసరికి జనం బేంబేలు పడిపోయారు. భర్తనీ, కొడుకునీ ఒకేసారి పోగొట్టుకున్న పైడితల్లి వేదన కదిలించి వేసింది. "నమ్మిన తల్లే కడుపున సిచ్చెట్టింది. ఏం పాపం 'సేసాను తల్లీ! నా పెనిమిట్నీ బిడ్డను ఒకేసారి మింగేసావు.." అని ఒడ్డమ్మటే తిరిగేది. నిజంగానే పాపం పిచ్చెక్కిపోయింది పైడితల్లికి.

ప్రకృతిని గురించిన అవగాహన కాని, అధ్యయనం కాని నాకు లేవు. గోదావరి అంటే ఒక గొప్ప ప్రవాహం మాత్రమే! ఒక్కసారిగా పరీవాహక ప్రాంతాలన్నింటినీ ముంచెత్తిన ఆ ఉగ్రరూపం.. భీతావహమ్మైన వాతావరణం చూస్తుంటే నాకు చెప్పలేని విరక్తి, భయం కలిగాయి. "దేవత, దేవత" అని పూజలు చేస్తున్నారే! నిజంగా దేవతే అయితే అందరినీ రక్షించాలి కాని ఇలా చేస్తుందా తాతయ్యా" అని నిలదీసాను.

"భూ కంపాలు, వరదలు, కరువు కాటకాలు, తుఫానులు.. ఇదంతా ప్రకృతిలో భాగం తల్లీ. కోటానుకోట్ల సంవత్సరాల క్రితం ఏర్పడిన పెను విస్ఫోటనం నుంచే అసలీ సృష్టంతా ఆవిర్భవించింది. ఎప్పుడేం జరగాలో అప్పుడది దానంతటదే జరిగిపోతుంది. ఇది ప్రకృతి నియమం. ఎంత నేర్చినా ప్రకృతి కన్నా మనిషి ఎప్పటికీ మేధావి కాలేడు. అప్పటికప్పుడు మనిషి ఊహించనంత వేగంగా జరిగిపోయే స్పందనాశక్తి ప్రకృతి ప్రత్యేకత. ఏ విధమ్మైనా ముందస్తు ప్రణాళికా లేని సహజమ్మైన ప్రకృతి స్పందనే ఇదంతా! మనిషి చాలా దుర్బలుడు ప్రకృతి ముందు. మానవ శక్తి-మేధ ఎందుకూ పనికిరాదు. అయితే కొంత అభివృద్ధిని సాధించినందువల్ల ప్రయత్నించి తన్ని తాను కొంత మేరకు కాపాడుకోగలడు..కాని ప్రకృతి గమనాన్ని నియంత్రించలేడు. సకాలంలో చక్కగా మితంగా జల్లుగా కురిసే వర్షం మనకెంతో హాయినిస్తుంది. పంటకు మేలు చేస్తుంది. అనేక సౌకర్యాలు సమకూరుస్తుంది. మితి తప్పి అతిగా కురిస్తే.. ఇదిగో వరదలై, తుఫానులై ప్రకృతి వైపరీత్యంగా మారి కష్టం నష్టం కలిగిస్తుంది"

అమ్మమ్మ ఆలోచన మరో రకంగా వుంది "లోకంలో అన్యాయం, అక్రమాలు, దుర్మార్గం పెరిగిపోతే ప్రకృతి ఆగ్రహించి శిక్షిస్తుంది. ప్రకృతిని కాపాడుకోకుండా అతిగా స్వార్థానికి మనిషి వాడుకుంటే ఫలితం ఇలాగే వుంటుంది. అమాయకులు నష్టపోతారు. తనంతట తనే మళ్ళీ శాంతిస్తుంది"

ఇద్దరి మనోభావాలు అర్థం చేసుకునే వయసు తనకి లేదప్పుడు. ఆ తరువాత సంవత్సరమే తను కాలేజీ చదువులకని అగ్రహారం వదిలి అమ్మనాన్నల దగ్గరికి సిటీకి వెళ్ళిపోయింది. తన చదువుకే పరిమితమ్మైంది. తన్నెంతో ప్రేమించి, పెంచిన వాళ్ళ గురించి తనసలేమీ పట్టించుకోలేదు. తాతయ్య ఎలా వున్నాడో? ఈ వయసులో ఒంటరిగా అక్కడ వుండగలడా? మామయ్య తనతో తీసికెళ్ళిపోతాడేమో! ఇంతకాలం ఒకరినొకరు ప్రాణంగా అగ్రహారమే స్వర్గంగా బతికారు. ఇక ఆయన ఒక్కడూ అక్కడేం ఉండగలడు? ఎక్కడో వాన పడుతున్నట్లుంది. చల్లని తేమగాలి ఆప్యాయంగా వంటిని చుట్టుకుంటోంది గోదావరి జిల్లాలు..! అటు తూర్పు.. ఇటు పశ్చిమ. ప్రతి గ్రామంలోనూ జీవధారగా గోదావరే! ప్రకృతి తన అపారమ్మైన ప్రేమోద్వేగతను వర్షమేఘమ్మై వాన అనే అమృత జడిలో ప్రకటిస్తోంది. సమస్త ప్రకృతి హరితవర్ణాన్ని అద్దుకుని పులకించిపోతోంది. భూ అంతర్గత వ్యవస్థలన్నీ ప్రాణశక్తితో పల్లవించి తుళ్ళిపడుతూ జీవకళతో కళకళలాడుతున్నాయి. ఉపరిభాగం పచ్చని పైరులై, తోటలై, సమృద్ధి సూచిస్తోంది. అమ్మమ్మ ఇదంతా కరుణించిన ప్రకృతి తన బిడ్డలకు ప్రసాదించిన వరదానమేనంటుంది. మరి సునామీలు, పెను తుఫానులు.. భూకంప బీభత్సాలు.. రౌద్ర రూపం.. ఇదంతా కూడా ప్రకృతి సహజస్థితేనంటారు. ఈ ఆధునిక కాలంలో వైజ్ఞానిక అభివృద్ధిని సాధిస్తున్నామనుకుంటున్న మానవజాతి ప్రకృతిని తన ఆధీనంలోకి తెచ్చుకుని అభివృద్ధిని సాధిస్తున్నామన్న భ్రమలో జరుపుతున్న అత్యాచార విధానాల ఫలితమే ఈ వినాశనమని అంటారు. ప్రపంచమంతా ఒక్కసారిగా నిశ్శేషంగా క్రమశిక్షణా ప్రణాళిక అమలు జరపటానికి వీలు కాని అతీత విస్ఫోటపు ఆరంభ దశలనుంచే మానవజాతి పరిణతి పొందుతూ వస్తోందన్న సిద్ధాంతం మాత్రం సత్యం.

అందరికన్నా నేనే ఆలస్యంగా వచ్చాను. ఇల్లంతా మా సమీప కుటుంబ సభ్యులు, బంధువులతో నిండివుంది. అందరూ నా కోసమే ఎదురుచూస్తున్నారు. ఐసు దిమ్మల మీద వుంచిన అమ్మమ్మ దేహాన్ని చూడాలంటే గుండె దడదడలాడుతోంది. ఏడుపు ఉబికి వస్తోంది, తాతయ్య లేచి వచ్చి- నా చెయ్యి పుచ్చుకుని అటు తీసుకువెళ్ళాడు. ఆ స్పర్శ నాకు ధైర్యం ఇస్తోంది. స్వాంతన, ఓదార్పు.. ఇస్తున్నటుంది. "రావలసిన వాళ్ళంతా వచ్చారు. జరగవలసింది త్వరగా కానీయండి" అన్నాడు తాతయ్య. ఎవరో ఏడుస్తున్నారు. దుఃఖం ఆపుకోలేకపోతున్నాను "ఎవరూ దుఃఖపడకండి.. ఆ జీవి ముక్తికి ఈలోకంలో మనం చెయ్యవలసింది చెయ్యాలి" అన్నాడు తాతయ్య నిర్వేదంగా.

అంత్యక్రియలు- దాన ధర్మాలు తదనంతర క్రమమంతా విధి పూర్వకంగా శాస్త్రోక్తంగా జరిపించారు.

పరివారమంతా గోదావరికి వచ్చాం.. అదే గోదావరి.. అమ్మమ్మ నా చెయ్యి పుచ్చుకుని పుణ్యస్నానాలెన్నో చేయించిన పవిత్ర తీర్థం.. విశృంఖలంగా పొంగి వరదై ఊరంతా ముంచెత్తిన ఉగ్రరూపిణి.. నిండుగా శాంతగా.. గంభీరంగా ప్రవహిస్తోంది. అమ్మమ్మ ప్రాణం.. ఊపిరి..! ఒక్కొక్కరి చేత పురోహితులు మంత్రం చెప్పి తర్పణలిప్పిస్తున్నారు. ఒకరి తరువాత ఒకరు భక్తిపూర్వకంగా తర్పణాలొదిలి గట్టు మీదికి వస్తున్నారు. ప్రతీ క్షణాన్ని గతంలో కలిపేస్తూ అల తరువాత అలగా ప్రవాహం కదిలిపోతోంది. నా కన్నీరు నదీ జలంతో కలిసిపోతోంది. చల్లగా, వెచ్చగా ప్రేమగా నిండు గుండెల్తో ఆలింగనం చేసుకుని ఓదారుస్తోంది. అమ్మమ్మ ఎక్కడికి పోయింది.. ఎక్కడికీ పోలేదు, ఇక్కడే వుంది నా గుండెల్లో నాలోనే వుంటుంది అంటున్నట్టు. నిజమే! అమ్మమ్మ ఎక్కడికీ పోలేదు.. ఇక్కడే వుంది. తన ధ్యాస-ధ్యానము..తన జీవితము..గతి..మతీ..సర్వమూ ఏదేనీ భావిస్తూ, ఆరాధిస్తూ బతికిందో ఆ ప్రవాహంలోనే వుంది' ఆవిడ ఎక్కడికీ పోలేదు, పోయింది ఆ దేహమే. ఈ గాలిలో, ఈ నీళ్ళలో ఈ గట్టు మీద పంచభూతాలలో ఇక్కడే వుంది. అమ్మమ్మే గోదావరి..గోదావరే అమ్మమ్మ. మనిషంటే ప్రవాహమే! జీవితమంటే ఆగిపోయేది కాదు సాగిపోయేది. ప్రవాహం ఆగని కాలమే!' తాతయ్య అంత నిబ్బరంగా ఎలా వుండగలడో ఇప్పుడు అర్థమౌతోంది. వెళ్ళి పోయింది అమ్మమ్మ భౌతికదేహమే. నాశనం లేని ఆత్మ ఇక్కడే వుంది. 'అవునవునం'టూ క్షణం ఆగి నన్ను తట్టి కదిలిపోతోంది. అలలు వచ్చి వెళ్ళిపోతున్నాయి. మహా ప్రవాహం నిరంతరంగా సాగిపోతోంది.

★

## రచయిత్రి పరిచయం



వివిధ తెలుగు పత్రికలన్నింటికీ కథలు రాస్తున్నాను. ఉత్తమ కథలుగా కొన్ని పురస్కారాలందుకున్నారు. కొన్ని కథలు హిందీ, కన్నడ, ఆంగ్ల భాషలలోకి అనువదించబడ్డాయి. పది నవలలు ముద్రితమయ్యాయి. 'చిలకలంచు జరీ కోక' ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక అవార్డు అందుకుంది. ఆకాశవాణి ద్వారా కథలు, నాటికలు ప్రసిద్ధి పొందాయి. అన్ని సాహితీ ప్రక్రియలలో కృషిచేస్తున్నా కథా రచన ఇష్టమైనది. ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధులు బహు గ్రంథకర్త యర్రమిల్లి నరసింహారావు తండ్రి-తల్లి పరమేశ్వరి. ఆంధ్రాబ్యాంక్‌లో ఆఫీసర్‌గా పనిచేశాను. మంచి పుస్తకాలు చదవడం, మానవీయ విలువలు గల మంచి రచనలు చేయడం ఇష్టం. 'ప్రవాహం' కథను స్వీకరించి, బహుమతి అందించినందుకు ధన్యవాదాలు.

– యర్రమిల్లి విజయలక్ష్మి (తణుకు)